# బీడీ టేకేదారుల కృతజ్ఞత


సమావేశంలో మాట్లాడుతున్న రాష్ట్ర ప్రణాళికా సంఘం ఉపాధ్యక్షుడు బోయినపల్లి వినోద్‌కుమార్

- జీవనభృతి కల్పించిన బీఆర్‌ఎస్‌కు మద్దతు
- తీర్మాన పత్రాన్ని రాష్ట్ర ప్రణాళికా సంఘం ఉపాధ్యక్షుడు వినోద్‌కుమార్‌కు అందించిన రాష్ట్ర అధ్యక్షుడు రూప్‌సింగ్
- బీడీ కార్మికులకు అండగా కేసీఆర్: వినోద్
- పాల్గొన్న 500మంది టేకేదారులు

సిరిసిల్ల/సిరిసిల్ల టౌన్, అక్టోబర్ 31: అసెంబ్లీ ఎన్నికల నేపథ్యంలో తమ సంపూర్ణ మద్దతు బీఆర్‌ఎస్‌కేనంటూ.. బీడీ టేకేదారులు స్పష్టంచేశారు. ఈ మేరకు సంబంధిత తీర్మాన పత్రాన్ని రాష్ట్ర అధ్యక్షుడు రూప్‌సింగ్ మంగళవారం జిల్లా కేంద్రంలోని తెలంగాణభవన్‌లో రాష్ట్ర ప్రణాళికా సంఘం ఉపాధ్యక్షుడు బోయినపల్లి వినోద్‌కుమార్‌కు అందించారు. ఈ సందర్భంగా బీఆర్‌ఎస్ జిల్లా కార్మిక విభాగం అధ్యక్షుడు వెంగల శ్రీనివాస్ ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన సమావేశంలో వినోద్‌కుమార్ మాట్లాడారు. బీడీ పరిశ్రమ కుదేలవుతున్న తరుణంలో సీఎం కేసీఆర్ వారికి అండగా నిలిచి జీవనభృతి కల్పించారని కొనియాడారు. బీడీ కార్మికుల సమస్యలు పరిష్కరించి.. వారికి సీఎం కేసీఆర్ వెన్నుదన్నుగా నిలిచారన్నారు. ఎన్నికల సమయంలో ఇవ్వని హామీలు కూడా ఎన్నో అమలు చేశారని కొనియాడారు. తాను ఎంపీగా ఓడిపోయినప్పటికీ.. రాష్ట్ర, నియోజకవర్గ అభివృద్ధికి కృషి చేస్తున్నానని తెలిపారు. కరీంనగర్‌ను స్మార్ట్ సిటీగా మార్చానని గుర్తు చేశారు. ప్రస్తుత ఎంపీ బండి సంజయ్ పార్లమెంట్ నియోజకవర్గానికి ఒక్క రూపాయి అయినా తెచ్చాడా..? అని ప్రశ్నించారు. జిల్లాకు ఒక నవోదయ విద్యాలయాన్ని కూడా మంజూరు చేయించలేదన్నారు. కాంగ్రెస్ పాలనలో నీటి కష్టా లుండేవని, ప్రస్తుతం చెరువులు, కుంటలు గోదావరి జలాలతో నిండుకుండను తలపిస్తున్నాయని తెలిపారు. కార్యక్రమంలో టీపీటీడీసీ చైర్మన్ గూడూరి ప్రవీణ్, బీఆర్‌ఎస్ జిల్లా అధ్యక్షుడు తోట ఆగయ్య, రాష్ట్ర నాయకుడు చీటి నర్సింగరావు, సిరిసిల్ల పట్టణాధ్యక్షుడు జిందం చక్రపాణి, బీఆర్‌ఎస్ కార్మిక విభాగం రాష్ట్ర అధ్యక్షుడు రూప్‌సింగ్, బీడీ టేకేదారుల సంఘం అధ్యక్షుడు శ్రీరాముల దశరథం, మ్యాన వెంకటేశం, నాయిని కిషన్, అడ్లగడ్డ భాస్కర్, 500మంది టేకేదారులు పాల్గొన్నారు.


తెలంగాణభవన్‌లో నిర్వహించిన సమావేశానికి హాజరైన టేకేదారులు


తిమ్మాపూర్ రూరల్ : మన్నెంపల్లిలో ప్రచారం నిర్వహిస్తున్న బీఆర్‌ఎస్ శ్రేణులు


మానకొండూర్ రూరల్ : ముంజంపల్లిలో ఓటు అభ్యర్థిస్తున్న బీఆర్‌ఎస్ నాయకులు


# ఇంటింటికీ వెళ్లి.. పథకాలు వివరించి..

- ఓటు అభ్యర్థించిన బీఆర్‌ఎస్ నాయకులు, కార్యకర్తలు

మానకొండూర్ రూరల్, అక్టోబర్ 31: మండలంలోని ముంజంపల్లి, వన్నారం, శ్రీనివాస్‌నగర్, వెల్ది, అన్నారం, వేగురుపల్లి, కొండపల్కల తదితర గ్రామాల్లో మంగళవారం ఆయా గ్రామాల సర్పంచులు, ఎంపీటీసీలు, బీఆర్‌ఎస్ నాయకులు ఎన్నికల ప్రచారం నిర్వహించారు. ఇంటింటికీ వెళ్లి బీఆర్‌ఎస్ ప్రభుత్వ పథకాలను వివరించారు. ప్రజలకు కరపత్రాలను అందజేశారు. కారుగుర్తుకు ఓటు వేయాలని కోరారు. బీఆర్‌ఎస్ అభ్యర్థి, ఎమ్మెల్యే డాక్టర్ రసమయి బాలకిషన్ భారీ మెజార్టీతో గెలువాలని వన్నారం గ్రామంలోని ఆంజనేయ స్వామి ఆలయంలో ప్రత్యేక పూజలు చేశారు. కార్యక్రమంలో సర్పంచులు, ఎంపీటీసీలు, బీఆర్‌ఎస్ సీనియర్ నాయకులు, అనుబంధ సంఘాల నేతలు, మహిళా నాయకులు, గ్రామస్తులు పాల్గొన్నారు.

*గన్నేరువరంలో..*

గన్నేరువరం అక్టోబర్ 31: మండలంలోని గుండ్లపల్లి, చీమలకుంటపల్లి గ్రామాల్లో బీఆర్‌ఎస్ నాయకులు పార్టీ అభ్యర్థి, ఎమ్మెల్యే రసమయి బాలకిషన్ తరపున ప్రచారం నిర్వహించారు. ఇంటింటికీ వెళ్లి ఓటర్లకు బీఆర్‌ఎస్ మ్యానిఫెస్టోలోని అంశాలను వివరించారు. కారు గుర్తుకే ఓటు వేసి రసమయి బాలకిషన్‌ను మూడోసారి గెలిపించి, ముఖ్యమంత్రి నాయకత్వాన్ని బలపరచాలని ప్రజలను కోరారు. అలాగే ఎన్నికల్లో బీఆర్‌ఎస్ అభ్యర్థి రసమయి బాలకిషన్ ఘన విజయం సాధించాలని ఖాసీంపేట మానసాదేవి ఆలయం, మాదాపూర్‌లోని శ్రీ సీతారామాంజనేయ ఆలయంలో నాయకులు, కార్యకర్తలు ప్రత్యేక పూజలు చేశారు. అనంతరం ప్రచారం నిర్వహించారు. కార్యక్రమంలో బీఆర్‌ఎస్ పార్టీ మండలాధ్యక్షుడు గంప వెంకన్న, మహిళా మండలాధ్యక్షురాలు నవీన, సర్పంచులు సంపత్, కర్ర రేఖ కొమురయ్య, నాయకులు చంద్రారెడ్డి, ఐలయ్య పాల్గొన్నారు.


గన్నేరువరం: ఖాసీంపేటలో కరపత్రాలను అందిస్తూ ఓటు అభ్యర్థిస్తున్న బీఆర్‌ఎస్ నాయకులు

## బీఆర్‌ఎస్‌తోనే అభివృద్ధి సాధ్యం

- రాజన్న సిరిసిల్ల జడ్పీ వైస్ చైర్మన్ సిద్ధం వేణు


వెంకట్రావుపల్లిలో కారు గుర్తుకు ఓటు వేయాలని ప్రచారం చేస్తున్న జడ్పీ వైస్ చైర్మన్ సిద్ధం వేణు

ఇల్లంతకుంట, అక్టోబర్ 31: తెలంగాణ రాష్ట్రంలో బీఆర్‌ఎస్‌తోనే అభివృద్ధి సాధ్యమని రాజన్న సిరిసిల్ల జడ్పీ వైస్ చైర్మన్ సిద్ధం వేణు పేర్కొన్నారు. మంగళవారం మండల కేంద్రంతోపాటు అనంతగిరి, వెంకట్రావు పల్లి, జవారుపేట, తిప్పాపూర్‌లో బీఆర్‌ఎస్ నాయకులతో కలిసి మానకొండూర్ ఎమ్మెల్యే రసమయి బాలకిషన్ తరపున ప్రచారం నిర్వహించారు. ఈ సందర్భంగా జడ్పీ వైస్ చైర్మన్.. 10 సంవత్సరాలుగా బీఆర్‌ఎస్ ప్రభుత్వం అందించిన పథకాలను ఇంటింటా వివరిస్తూ మానకొండూర్ ఎమ్మెల్యేగా డాక్టర్ రసమయి బాలకిషన్ మూడోసారి భారీ మెజార్టీతో గెలిపించాలని కోరారు. కాంగ్రెస్ ఎన్నికల హామీలకు గ్యారంటీ లేదని, అందుకు నిదర్శనం కర్ణాటక రాష్ట్రమేనని చెప్పారు. వ్యవసాయానికి ఐదు గంటల కరెంటు మాత్రమే ఇస్తున్నట్టు కాంగ్రెస్ మంత్రులే స్వయంగా బహిరంగ సభలో వెల్లడించారని గుర్తు చేశారు. కాంగ్రెస్‌ను గెలిపిస్తే అభివృద్ధి కుంటు పడుతుందన్నారు. కార్యక్రమంలో ఏఎంసీ చైర్మన్ మామిడి సంజీవ్, రైతు బంధు సమితి మండలాధ్యక్షుడు చెరుకుపల్లి రాజిరెడ్డి, ఏఎంసీ వైస్ చైర్మన్ ఎంద్ర చందన్, సర్పంచులు కూనబోయిన భాగ్యలక్ష్మి, మంద సుశీల, ఎంపీటీసీ ఒగ్గు నర్సయ్య, ఉప సర్పంచ్ సాదుల్, నాయకులు కూనబోయిన బాలరాజు, రఘు, రమేశ్, లక్ష్మణ్, ఉస్మాన్, భాస్కర్, రాములు, లింగం తదితరులు పాల్గొన్నారు.

## బీఆర్‌ఎస్ మైనార్టీ సెల్ నియోజకవర్గ కోఆర్డినేటర్‌గా అఫ్జల్


అఫ్జల్ అహ్మద్‌కు నియామక పత్రం అందజేస్తున్న ఎమ్మెల్యే రసమయి బాలకిషన్

మానకొండూర్, అక్టోబర్ 31: బీఆర్‌ఎస్ మైనార్టీ సెల్ మానకొండూర్ నియోజకవర్గ కోఆర్డినేటర్‌గా మానకొండూర్‌కు చెందిన సయ్యద్ అఫ్జల్ అహ్మద్ నియమితులయ్యారు. మంగళవారం మండల కేంద్రంలో అఫ్జల్‌కు నియామక పత్రాన్ని రాష్ట్ర సాంస్కృతిక సారథి చైర్మన్, ఎమ్మెల్యే రసమయి బాలకిషన్ అందజేశారు. నియోజకవర్గంలో మైనార్టీ విభాగం బలోపేతానికి కృషి చేయాలని కోరారు. కార్యక్రమంలో బీఆర్‌ఎస్ జిల్లా అధ్యక్షుడు, సుడా చైర్మన్ జీవీ రామకృష్ణారావు, జడ్పీటీసీ తాళ్లపెల్లి శేఖర్‌గౌడ్, నాయకులు రొడ్డ పృథ్వీరాజ్, పిట్టల మధు, సయ్యద్ ఖలీల్, ఉండింటి శ్యాంసన్ తదితరులు పాల్గొన్నారు.

## జాతీయ సమైక్యతను కాపాడాలి

తిమ్మాపూర్, అక్టోబర్ 31: మండలంలోని రామకృష్ణకాలనీ గ్రామంలో గల వాగేశ్వరి ఇంజినీరింగ్ కళాశాలలో సర్దార్ వల్లభ్‌భాయ్ పటేల్ జయంతి సందర్భంగా ఎన్ఎస్ఎస్ ఆధ్వర్యంలో జాతీయ సమైక్యతా దినోత్సవాన్ని మంగళవారం నిర్వహించారు. జాతీయ సమైక్యతను కాపాడాలని కళాశాల జనరల్ సెక్రటరీ డాక్టర్ శ్రీనివాస్‌రెడ్డి విద్యార్థులకు సూచించారు. ఆయన జీవిత చరిత్రను వివరించారు. జాతీయ గీతాలాపాన అనంతరం ప్రతిజ్ఞ చేయించారు. కార్యక్రమంలో జాయింట్ సెక్రటరీ శ్రీనివాస్‌రెడ్డి, డైరెక్టర్లు ప్రకాశ్ రెడ్డి, వినోద్, ప్రిన్సిపల్ డాక్టర్ శ్రీనివాస్, ప్రోగ్రాం ఆఫీసర్ సాయినాథ్, హెచ్‌వోడీలు, తదితరులు పాల్గొన్నారు.

## ఘనంగా సర్దార్ వల్లభ్‌భాయ్ పటేల్ జయంతి

మానకొండూర్, అక్టోబర్ 31: మండల కేంద్రంలోని ప్రభుత్వ జూనియర్ కళాశాలలో మంగళవారం సర్దార్ వల్లభ్‌భాయ్ పటేల్ జయంతి వేడుకలను ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా ప్రిన్సిపాల్ వీ ఆంజనేయరావు సర్దార్ పటేల్ చిత్రపటానికి పూలమాల వేసి నివాళులర్పించారు. సర్దార్ వల్లభ్‌భాయ్ పటేల్ జయంతిని పురస్కరించుకుని రాష్ట్రీయ ఏక్తాదివస్ కార్యక్రమంలో భాగంగా విద్యార్థులు, ఆధ్యాపకులు కలిసి దేశ ఐకమత్యం, సమగ్రత, భద్రతను కాపాడేందుకు అంకితమవుతామని ప్రతిజ్ఞ చేశారు. కార్యక్రమంలో అధ్యాపకులు, విద్యార్థులు పాల్గొన్నారు.


మానకొండూర్ ప్రభుత్వ జూనియర్ కళాశాలలో ప్రతిజ్ఞ చేస్తున్న విద్యార్థులు